

## భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

వీర హనుమాన్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

02



సంగారెడ్డి మెదక్

బుధవారం 23 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:07

# నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు..

- సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం
- 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయం..
- జిల్లా అదనపు కలెక్టర్ పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి..
- ప్రభుత్వ విద్య వ్యవస్థ బలోపేతానికి ప్రథమ ప్రాధాన్యత..
- ఎడ్యుకేషనల్ హబ్ గా పటాన్ చెరు
- భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులది
- మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్ చెరు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా ప్రభుత్వ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు
- 100 మంది ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం







**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని, భావి భారత పౌరులను తయారు చేయాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు అన్నారు. గత 25 సంవత్సరాలుగా ప్రతి ఏటా గురు పూజోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కి అభినందనలు తెలిపారు.పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో మంగళవారం.. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ప్రభుత్వ పాఠశాల గురుపూజోత్సవ వేడుకలకు అదనపు కలెక్టర్ పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

మిగతా 2 లో



# నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు..

మొదటిపేజీ తరువాయి



ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఒక విద్యార్థి ఉత్తమ పౌరుడుగా ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఉపాధ్యాయులు ఉత్తమ భవిష్యత్తును అందిస్తారని అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులను.. ఉత్తమ బోధన చేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం పట్ల ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ని ప్రశంసించారు. పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పాత్ర అభినందనీయమని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ.. ప్రతి విద్యార్థిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుని వెళుతున్నామని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తూ.. ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించడం పట్ల అభినందనలు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎటువంటి సమస్యలు ఉన్న స్వయంగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముందుంటారని కితాబుని ఇచ్చారు. ప్రతి సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సైతం ప్రోత్సాహకాలు అందించడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాల వినియోగం ఒక జటిల సమస్యగా మారిందని అన్నారు. పాఠశాల స్థాయి నుండి మత్తుమదార్థాలు వాడకం వల్ల కలిగే అనార్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను కోరారు. మినీ ఇండియాగా పేరుందిన పటాన్ చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని.. వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో






ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల భవనాలు తీర్చిదిద్దుతూ మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు..ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య మూలంగా.. అడ్మిషన్ లు సైతం దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా ప్రతి ఏటా గురుపూజోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసి, ఉత్తమ గురువులను సన్మానించడం సంతోషకరంగా ఉందని తెలిపారు. అనంతరం పటాన్





చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృతంలో ప్రతి సంవత్సరం గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థిని విద్యార్థులచే ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. గురువులకు పాదాభివందనం పేరుతో తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమానికి మంత్రముగ్ధులైన ఎమ్మెల్యే స్వయంగా 26వేల రూపాయల నగదు బహుమతి అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

మొదటిపేజీ తరువాయి



**అందోల్, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి):**

జోగిపేట పట్టణంలోని వీర హనుమాన్ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో గణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, హోమాగ్ని మధ్య నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.పట్టణానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. మల్లికార్జున్ దంపతులు, వీర హనుమాన్ సేవాసమితి సభ్యులు పురం రాఘవేందర్ దంపతులు, సయ్యా సాయి దంపతులు, ఉలువల శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో పురోహితులు దత్తు, శంకర్ పంతులు గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.హోమం అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సేవాసమితి సభ్యులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణపతి హోమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# పిల్లుట్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ,,



**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 22:**

శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ బుర్ర మురళీ గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు,సబ్సిడీ రేషన్ సరుకులు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం,గ్రామ అభివృద్ధి కోసం స్థానిక ప్రజాప్రతినిధులు అందిస్తున్న సహకారం మరువలేని ఈ సందర్భంగా గుర్తు చేశారు,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాఘవ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు సాలె ప్రభుశంకర్,ఉప సర్పంచ్ గొల్ల స్వామి,గ్రామ కార్యదర్శి నాగేష్,వార్డు సభ్యులు గొల్ల బిక్షపతి,పిల్లి మధు,తలారి హనుమంతు,గ్రామ మహిళా సంఘాల సభ్యులు,బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర ఆంజనేయులు గౌడ్,ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు,వైస్ చైర్మన్ గుర్రాల బాలేష్,బసంపల్లి నర్సింలు గౌడ్,సంద్ర సత్తయ్య, బుర్ర తిరుపతి గౌడ్, గులాయిగారి కిష్టయ్య,బుర్ర వినయ్ గౌడ్,పిల్లి చంద్రయ్య, గుల్లయిగారి రవి,గాండ్ల అంజయ్య,పిల్లి సత్తయ్య,గొల్ల కిష్టయ్య,శివయ్య,సంద్ర శ్రీనివాస్,ముప్పిడి సత్తయ్య, కమ్మరి వినయ్ కుమార్,మాస్కురి కన్నయ్య, పిల్లి ప్రవీణ్,గుర్రాల ప్రవీణ్ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రుద్రాక్షలు,కృష్ణ తులసి పూసలతో ఆంజనేయ స్వామికి విశేష అలంకరణ

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 22:**

శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కుల గ్రామ శివారులో గల స్వయంభు శ్రీ సహకార చాకరిమెట్ల ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.హిమాలయ ప్రాంతంలోని రుద్రాక్ష వృక్షాల నుంచి సేకరించిన రుద్రాక్షలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణను రాజ ప్రభు శర్మ పంతులు చేశారు.అదేవిధంగా మంచి కృష్ణ తులసి పూసలను ఉపయోగించి స్వామివారికి మరో ప్రత్యేక అలంకరణ చేశారు. రుద్రాక్షలు,కృష్ణ తులసి పూసలతో అలంకరించిన ఆంజనేయ స్వామివారు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు,శాంతి,సౌభాగ్యం కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆంజనేయ శర్మ,రాజ ప్రభు శర్మ పంతులు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారి ప్రత్యేక అలంకరణను దర్శించుకుని ఆధ్యాత్మిక భావనకు లోనయ్యారు.



# మన్నాన్పల్లి పాఠశాలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండల పరిధిలోని మన్నాన్పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో "స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పరిశుభ్రతపై





అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామచందర్ రెడ్డి మాట్లాడుతూ.. "పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలం. స్వచ్ఛతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలి. గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజలు, విద్యార్థులు, యువత కలిసి పనిచేయాలి" అని అన్నారు.పాఠశాల విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఆయన పేర్కొన్నారు. "పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది.. స్వచ్ఛతతోనే ఆరోగ్యకరమైన సమాజం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వాతీ, ఉప సర్పంచ్ శివశంకర్, పాఠశాల ఉపాధ్యాయులు, వార్డ్ మెంబర్లు రామచంద్రయ్య, నాగేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మల్లేశం, ఫీల్డ్ అసిస్టెంట్ బంధయ్య ,కాంగ్రెస్ నాయకులు బుచ్చయ్య, విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## కేజీబీవీ శివ్వంపేటలో హెడ్ కుక్ పోస్టు ఖాళీ

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 22:**

శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) శివ్వంపేటలో హెడ్ కుక్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి తెలిపారు.ఈ పోస్టుకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.హెడ్ కుక్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణతతో పాటు వంట చేయడంలో అనుభవం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.9,750 వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టుకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు.అర్హత,ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు సెప్టెంబర్ 23 నుంచి 25వ తేదీ వరకు కేజీబీవీ శివ్వంపేట పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని ప్రత్యేక అధికారి సూచించారు.



# విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం.. చదువుకు తోడుగా సౌకర్యాలు..

## - ప్రభుత్వ బడిలో విద్యార్థులకు 8 రకాల కిట్లు పంపిణీ

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 22:**

విద్యార్థులకు అవసరమైన పాఠశాల సామగ్రిని అందించి వారి విద్యాభ్యాసానికి మరింత తోడ్పాటునందించే ఉద్దేశంతో వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 8 రకాల కిట్లను పంపిణీ చేశారు.







పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెల్దుర్తి ఏపీఎం సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఒక జత యూనిఫామ్, ఐడీ కార్డు, స్కూల్ బ్యాగ్, వైట్ షూస్, బ్లాక్ షూస్, బెల్ట్ తదితర పాఠశాల అవసరాలకు సంబంధించిన సామగ్రిని స్థానిక గ్రామ సర్పంచ్ దండెం ఆదర్శ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాధురి అందజేశారు. విద్యార్థులకు పాఠశాల అవసరాల కోసం ప్రత్యేకంగా కిట్లను అందించడం ద్వారా వారు సౌకర్యవంతంగా, క్రమశిక్షణతో పాఠశాలకు హాజరై విద్యపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుందని ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం, పాఠశాల యంత్రాంగం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో ముందుకు సాగాలని సూచించారు. అలాగే విద్యార్థులు ప్రతిరోజూ యూనిఫామ్‌తో పాటు పంపిణీ చేసిన కిట్లను సక్రమంగా వినియోగిస్తూ క్రమశిక్షణ పాటించాలని సర్పంచ్ దండెం ఆదర్శ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాధురి సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో పాఠశాల యంత్రాంగంతో కలిసి పనిచేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీజేపీ ప్రజాప్రతినిధులను వేధించొద్దు

## - కలెక్టరేట్ ఎదుట జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా









**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి**

బీజేపీ నుంచి ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులను అధికార పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు వేధిస్తున్నారని సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆరోపించారు. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించకుండా అభివృద్ధి పనులకు ఆటంకాలు కల్పిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ సర్పంచులు ఉన్న గ్రామాల్లో అధికారులు వారి అధికారాలను పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొన్నిచోట్ల పంచాయతీ కార్యదర్శులు సర్పంచుల స్థానంలో పెత్తనం చెలాయిస్తున్నారని అన్నారు. అధికార పార్టీ నాయకులు కూడా వారికి సహకరిస్తూ బీజేపీ ప్రజాప్రతినిధులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు సక్రమంగా జరగడం లేదని ఆమె అన్నారు. స్థానిక సంస్థలకు అందాల్సిన నిధులను ఎమ్మెల్యేలు, మంత్రుల పరిధిలో ఉంచడంతో ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లో పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించరాదని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రజాప్రతినిధులకు నిధులు, విధులు, అధికారాలు కల్పించి గ్రామాలు, మున్సిపాలిటీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకే ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాపరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదెల్లి రవీందర్, దేశ్‌పాండే, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, నాగరాజుతో పాటు బీజేపీ సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్, సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి న్యూస్)**

మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో భక్తిశ్రద్ధ లతో నిర్వహించిన శ్రీ మల్లికార్జున స్వామి వారి పల్లకి సేవలో శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు, మొగుడం పల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ“మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరి పై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషా లతో, ఆయురారో గ్యాలతో వర్ధిల్లాలనిఆకాంక్షిస్తున్నాను. భక్తి, ఆధ్యాత్మికతతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయి. స్వామి వారి కృపతో ప్రజలందరికీ శాంతి, సంతోషం కలగాలని కోరుకుంటున్నాను” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాణిక్ ,గ్రామ పార్టీ అధ్యక్షులు ఓంకార్ రెడ్డి, మాజి సర్పంచ్ రాజు హాబీ, సీనియర్ నాయకులు ప్రతాప్ కులకర్ణి, ఈశ్వర్ రెడ్డి, షకీల్, గోపాల్ , సంజు, రాథోడ్ భీమ్ రావు నాయక్, నయీం ఉద్దీన్, చిన్న రెడ్డి, బి రాజు, గాలెప్ప, యశ్వంత్ రెడ్డి, బక్కన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





# డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డికి జర్నలిస్టుల ఘన సన్మానం

**కల్హేర్, సెప్టెంబర్ 22, ప్రజాజ్యోతి:**

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డిని మంగళవారం నారాయణఖేడ్ జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్ర శేఖర్‌రెడ్డితో పాటు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డికి జర్నలిస్టులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడికి జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు యం.ఏ. ఖైసర్, ఆంజనేయులు, డేనియల్, ఇబ్రహీం, శరణప్ప, షయబాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాజ్యోతి
బుధవారం 23 సెప్టెంబర్ 2026

# కొండాపూర్ పోలీస్ స్టేషన్ నుంచే పాత నేరస్తుడి పరారీ!

## - ఫింగర్‌ప్రింట్‌తో దొంగతనం కేసులో గుట్టు రట్టు..

## - విచారణకు తీసుకొచ్చిన వ్యక్తి పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న వైనం

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి**

దొంగతనం కేసులో కీలక ఆధారం లభించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొచ్చిన ఓ పాత నేరస్తుడు ఏకంగా పోలీస్‌స్టేషన్ నుంచే పరారైన ఘటన కొండాపూర్ మండలంలో కలకలం రేపింది. దొంగతనం జరిగిన ప్రాంతంలో లభించిన ఫింగర్‌ప్రింట్లను పరిశీలించగా పాత నేరస్తుడి వేలిముద్రలతో సరిపోలినట్లు సమాచారం. దీంతో ఆదివారం ఉదయం అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

**ఫింగర్‌ప్రింట్‌తో గుట్టు రట్టు..**

మల్కాపూర్ చౌరస్తాలో నిర్వహించిన బయోమెట్రిక్ చెక్‌లో లభించిన ఫింగర్‌ప్రింట్లను పాత నేరస్తుల వివరాలతో పోల్చగా ఓ వ్యక్తి వేలిముద్రలతో మ్యాచ్ అయినట్లు తెలిసింది. దీంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని దొంగతనం కేసుపై విచారించేందుకు స్టేషన్‌కు తరలించారు. అయితే విచారణ ప్రారంభించే సమయంలో పోలీసుల దృష్టిని మళ్లించి సదరు వ్యక్తి స్టేషన్ నుంచి తప్పించుకున్నట్లు సమాచారం. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమైన పోలీసులు అతడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు!**

పాత నేర చరిత్ర ఉన్న వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన సమయంలో తగిన భద్రతా చర్యలు తీసుకున్నారా? పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి స్టేషన్ నుంచే ఎలా తప్పించుకున్నాడు? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరిని వివరణ**

ఓ దొంగతనం కేసులో విచారణ నిమిత్తం పాత నేరస్తుడిని స్టేషన్‌కు తీసుకొచ్చామని తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పరారైన వ్యక్తిని పట్టుకునేందుకు అన్ని వైపులా గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు. ఫింగర్‌ప్రింట్ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు.. చివరకు అతడు పోలీస్‌స్టేషన్ నుంచే తప్పించుకోవడంతో ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.




# అమ్మ ప్రేమ చిరస్థాయిగా నిలవాలి

## - హుగ్గెల్లిలో ఘనంగా ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం- పాల్గొన్న గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ. విమల శ్రీనివాస్ రెడ్డి

**జహీరాబాద్, సెప్టెంబరు 24(ప్రజా జ్యోతి న్యూస్)**

పర్యావరణ పరిరక్షణతో పాటు జన్మనిచ్చిన తల్లిపై ప్రేమ, గౌరవాలను చాటేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమాన్ని హుగ్గెల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. ప్రతి ఒక్కరూ తమ తల్లి జ్ఞాపకార్థం లేదా గౌరవార్థం ఒక మొక్కను నాటి,దానిని ఒక బిడ్డలా సంరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్లను పెంచడం ద్వారా భావితరా లకు స్వచ్ఛమైన వాతా వరణాన్ని, ప్రాణవాయువు ను అందించ వచ్చని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణను అలవరచుకోవాలని, పాఠశాలలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, విద్యార్థులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# వినాయక భక్తి పేరుతో అర్ధరాత్రి వరకు శబ్ద హోరు!

## - రాత్రి 12 గంటల వరకు మోగుతున్న సౌండ్ సిస్టమ్‌లు..

## - ఇబ్బందుల్లో గ్రామస్తులు

## - పోలీసులు రాత్రివేళ గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలి..

## - డీజేలు వాడకం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

**కొండాపూర్ ప్రజా జ్యోతి**


వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా భక్తి పేరుతో ఏర్పాటు చేస్తున్న సౌండ్ సిస్టమ్‌లు గ్రామస్తులకు ఇబ్బందిగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొండాపూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద సాయంత్రం ప్రారంభమయ్యే పాటలు, భక్తి కార్యక్రమాలు రాత్రి వేళల్లోనూ అధిక శబ్దంతో కొనసాగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట తక్కువ శబ్దంతో భక్తి పాటలు ప్రారంభించి, అనంతరం క్రమంగా సౌండ్‌ను పెంచుతూ అర్ధరాత్రి వరకు కొనసాగిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు నిద్రకు దూరమవుతున్నారని వాపోతున్నారు. భక్తి కార్యక్రమాలు ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

**భక్తికి సమయపాలన అవసరం..**

వినాయక మండపాల వద్ద సౌండ్ సిస్టమ్‌లకు నిర్దిష్ట సమయపాలన, శబ్ద పరిమితి పాటించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. భక్తి పేరుతో ఇతరుల ప్రశాంతతకు భంగం కలగకుండా ఉత్సవాలు నిర్వహించాల్సిన బాధ్యత నిర్వాహకులపై కూడా ఉందని పేర్కొంటున్నారు. మరోవైపు అధిక శబ్దంతో కూడిన డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వల్ల ప్రజలకు ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**రాత్రివేళ పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి**

గ్రామాల్లో రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించి, అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లు వినిపిస్తున్న ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా శబ్ద పరిమితులు, సమయపాలన పాటించేలా నిర్వాహకులకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భక్తి పేరుతో ఇతరులకు ఇబ్బంది కలగకుండా.. ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు నిర్వహించాలన్నదే గ్రామస్తుల ప్రధాన డిమాండ్‌గా మారింది.



# రైతులకు నాణ్యమైన శనగ విత్తనాల పంపిణీ





**రాయికోడ్ సెప్టెంబర్ 22 (ప్రజాజ్యోతి):**

రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు నాణ్యమైన శనగ విత్తనాలను అందించేందుకు శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి సారిక మాట్లాడుతూ.. ఒక్క బ్యాగులో 25 కిలోల శనగ విత్తనాలు ఉంటాయని తెలిపారు. రబీ సీజన్‌లో శనగ పంటకు మంచి డిమాండ్ ఉండటంతో పాటు తక్కువ నీటి వనరులతో కూడా సాగు చేసుకునే అవకాశం ఉండడంతో రైతులకు శనగ అనుకూలమైన పంటగా నిలుస్తుందని పేర్కొన్నారు.రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడంతో పాటు విత్తన శుద్ధి చేసి,వ్యవసాయ శాఖ సూచించిన సమయంలో విత్తుకోవాలని సూచించారు.సమతుల్య ఎరువుల వినియోగం,తెగుళ్లు మరియు వ్యాధులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టడం ద్వారా శనగలో మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు,సిబ్బంది సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో శనగ సాగు చేపట్టాలని కోరారు.ముఖ్యంగా విత్తనాలను సకాలంలో విత్తడం ద్వారా పంటకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి జగదీశ్,గ్రామాల సర్పంచ్‌లు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# గంటల తరబడి కరెంట్ బంద్.. మొగుడంపల్లి రైతుల గగ్గోలు

**జహీరాబాద్, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్)**

నియోజకవర్గ మండల మొగుడంపల్లి విద్యుత్ శాఖ అధికారుల తీరు పై మొగుడంపల్లి మండల రైతులు, ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తామని ముందుగానే స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సి ఉన్నా, అధికారు లు పట్టించుకోవడం లేదంటున్నారు. దీంతో వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు తాగునీటి సరఫరా పైనా ప్రభావం పడుతోందని పేర్కొంటున్నారు. విద్యుత్ కోతలపై ముందస్తు సమాచారం ఇచ్చి, నిర్ణీత సమయానికే సరఫరా నిలిపివేయాలని రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# అన్నదాతకు ఘన సత్కారం

## వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్న ప్రసాద వితరణ

**అందోల్, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి):**

వినాయక నవరాత్రి ఉత్సవాలు కన్సాన్‌పల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అందోలు మండలం కన్సాన్‌పల్లి గ్రామంలోని హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.అన్న ప్రసాద వితరణకు గ్రామ సర్పంచ్ సునీత మహిపాల్ సహకారం అందించారు. ఈ సందర్భంగా యూత్ అసోసియేషన్ సభ్యులు సర్పంచ్ సునీత మహిపాల్‌తో పాటు ఆమె కుటుంబ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సర్పంచ్ సునీత మహిపాల్ కుటుంబ సమేతంగా హనుమాన్ మందిరంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. యూత్ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామంలో భక్తి, సేవా స్ఫూర్తిని చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది.



# మండల సాధారణ సమీక్ష సమావేశం

**రాయికోడ్ సెప్టెంబర్ 22 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మంగళవారం మండల సాధారణ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,ప్రభుత్వ పథకాల అమలు,ప్రజలకు అందుతున్న సేవలు, సమస్యలపై సమావేశంలో సమీక్షించారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు,ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ప్రధానంగా గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు,అభివృద్ధి పనులు, వైద్య,రోడ్డు రవాణా,వ్యవసాయం,పారిశుధ్యం తదితర అంశాలను అధికారులకు విన్నవించారు.ప్రజల సమస్యలను పరిశీలించి,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.అలాగే వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు,పనుల పురోగతిని సమావేశంలో వివరించారు.ప్రజలకు ప్రభుత్వ పథకాలు,సేవలు సక్రమంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య,ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి,మండల ప్రత్యేక అధికారి జగదీష్,ఎంపీడీవో షరీఫ్,ఎంఈఓ నర్సిములు,ఎంఏఓ సారిక,వివిధ శాఖల అధికారులు,గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.



# జన్మదిన వేడుకలకు సేవా స్ఫూర్తి

## - విద్యార్థులకు పండ్ల పంపిణీ చేసిన వట్పల్లి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

**వట్పల్లి, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి):**

జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి జన్మదినాన్ని పురస్కరించుకుని వట్పల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జగన్, ఉపాధ్యక్షుడు సతీష్‌తో పాటు నర్సింహారెడ్డి, విజయ్ ప్రకాష్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం, పండ్ల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రంజిత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభు, ఉపాధ్యాయులు రాజు, స్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

## - వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

## -ఎస్పీ పరితోష్ పంకజ్

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 22, ప్రజాజ్యోతి:**

వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మనూర్ మండల పరిధిలోని కమలాపూర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జన శోభాయాత్ర సాగే మార్గాల్లో రహదారుల పరిస్థితి, అవసరమైన మరమ్మతులు, నిమజ్జన ప్రాంతంలో బారికేడింగ్, లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నారాయణఖేడ్, మనూర్, నాగల్గిద్ద మండలాల నుంచి అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 9, 11 రోజుల నిమజ్జనాల సందర్భంగా అధిక సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానున్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అవసరమైన లైటింగ్, క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ



వెంకట్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఫైర్ డిపార్ట్మెంట్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు, ఎస్సైలు కోటేశ్వరరావు, శ్రీశైలం, కమలాపూర్ సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఉపాధి హామీ వీబీ. జి. రాం. జి తో ఫార్మ్ పాండ్‌లు. నిర్మాణం

**కల్హేర్, సెప్టెంబర్ 22 : ప్రజా జ్యోతి**

సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో ఫార్మ్ పాండ్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రైతు పెరమండ్ల సాయిలు పొలంలో ఫార్మ్ పాండ్ పనులను చేపట్టారు. అనువైన భూమి కలిగిన ప్రతి రైతుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఫార్మ్ పాండ్ నిర్మాణానికి అవకాశం కల్పిస్తోందని ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫార్మ్ పాండ్‌ల నిర్మాణం వల్ల వర్షపు నీటిని పొలాల్లో నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. దీంతో రైతులకు సాగునీటి లభ్యత మెరుగుపడటంతో పాటు, ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతు. ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదించి ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ కోరారు.




# నర్సాపూర్ బి.వి.రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (BVRIT)లో విదేశీ ఉన్నత విద్యా సదస్సు - పాస్‌పోర్ట్ మేళా

**నర్సాపూర్ 22 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)**



విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు బీవీఆర్ఐటీ వేదికగా నిలిచింది. నర్సాపూర్‌లోని లిబి.వి.రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కెరీర్ ఫౌండేషన్ (గేసైఫ్) సమన్వయంతో 'విదేశీ ఉన్నత విద్యా సదస్సుపాస్‌పోర్ట్ మేళా' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జర్మనీ, ఫ్రాన్స్, కెనడా, అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, స్వీడన్ తదితర దేశాలకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరయ్యారు. విద్యార్థులు యూనివర్సిటీ ప్రతినిధులతో నేరుగా మాట్లాడి వివిధ కోర్సులు, ప్రవేశ అవకాశాలు, విదేశీ విద్యా విధానాలు, కెరీర్ అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నేరుగా సమాచారం పి.ఎఫ్.హెచ్. యూనివర్సిటీ, నియోమా బిజినెస్ స్కూల్, షులిచ్ స్కూల్ ఆఫ్ బిజినెస్, యూనివర్సిటీ ఆఫ్ యూటాసాల్ట్ లేక్ సిటీ, కెక్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్, లండన్ సౌత్ బ్యాంక్ యూనివర్సిటీ, ఎమ్లియోన్ బిజినెస్ స్కూల్, క్వీన్ మేరీ యూనివర్సిటీ ఆఫ్ లండన్, ఎడిత్ కోవన్ యూనివర్సిటీ, నార్త్ఈస్టర్న్ యూనివర్సిటీ, యోంకోపింగ్ యూనివర్సిటీ, క్లార్క్‌సన్ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. కెరీర్‌కు ఉపయోగపడే కార్యక్రమాలపై దృష్టి శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి. విష్ణు రాజు ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని దీఎ=ఖ డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే తెలిపారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులను బీవీఆర్ఐటీకి తీసుకువచ్చి విద్యార్థులకు విదేశీ ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన కల్పించడం సంతోషకల.